
కథ

# పుణ్యదంపతులు

ఎల్. సుకన్య

అరవింద అప్పటికి నడవడం మొదలుపెట్టి పది నిమిషాలు అయింది. అప్పడే కాళ్లు నొప్పిపుడుతున్నాయి. అరవింద నిట్టూర్చింది. 'ఈ షుగర్‌తో చాలా ప్రాబ్లమ్‌గా వుంది. డాక్టరు రోజూ ఉదయం, సాయంత్రం నడవాలంటాడు. ఒక్కపూట పావుగంట నడవాలంటేనే కష్టంగా వుంటోంది'. అనుకుంటూ రోజూ నడిచే దోవ వదిలి పార్కు వైపుకి మలుపు తిరిగింది. అక్కడ క్వార్టర్సు మధ్యగా పార్కువుంది. కూచోడానికి సిమెంటు బెంచీలున్నాయి. పిల్లలు వుషారుగా ఆడుకుంటూ వుంటారు. సందడిగా వుంటుంది.



'షుగర్‌కి తోడు బి.పి. ఇవి పెద్ద జబ్బులు కావు. కాస్త జాగ్రత్తగా వుంటే అదుపులో వుంటాయంటాడు డాక్టర్. ఎంత ప్రమాదకరమైన జబ్బులో అనుభవించే వాళ్ళకి తెలుస్తుంది. అప్పటికీ వుప్పూకారం, మసాల్లాలేని చప్పిడి కూరలతో కాలం వెళ్ళబుచ్చుతోంది. పంచదార ముఖ మెరిగి ఎన్నాళ్ళయిందో? కాస్త స్వీటు ముక్క నోట్లో వేసుకునే అదృష్టమే లేదు. శరీరంలో శక్తంతా క్షీణిస్తున్నట్టే అన్పిస్తూ వుంటుంది. ఈ రోజుల్లో అందరూ బరువు తగ్గి స్మార్ట్‌గా వుండాలని డైటింగ్‌లు చేస్తూ నానాపాట్లు పడుతున్నారు. నాకు అలా పాట్లు పడాల్సిన అవసరమే లేదు' లోలోపల చిన్నగా నవ్వుకుంది.

'పార్కులోని సిమెంటు బేంచీని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది అరవిందకు. అటు నడచి, బెంచీ మీద కూలబడింది. పిల్లలు వుయ్యాల లూగుతున్నారు పోటీలుపడుతూ. క్రిందపడితే నడుము విరుగుతుందనే స్పృహేలేదు. పకపకలు, కిలకిలలు. భగవంతుడు మనిషికిచ్చిన అద్భుతమైన వరం బాల్యం. ఈ బాల్యం, ఈ హాయి మళ్ళీ తిరిగి రావు కదా!'

పిల్లల్నే చూస్తూ ఆనందిస్తూన్న అరవింద దృష్టి అనుకోకుండా ఎదురుగా కొద్ది దూరంలో సిమెంటు బెంచీమీద కూచుని వున్న వృద్ధ దంపతుల మీద పడింది. అంతే వాళ్ళని అలానే చూస్తుండిపోయింది. సూర్యాస్తమయపు ఆఖరి కిరణం లేత నారింజ రంగు వర్ణంలో వాళ్ళిద్దరి మీదా అలవోకగా పడుతోంది చెట్ల మధ్య నుండి.

దంపతులిద్దరూ చాలా ముచ్చటగా వున్నారు. అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా సన్నిహితంగా వున్నారు. వున్నతమైన సంస్కారం, సహృదయత వాళ్ళ ముఖాలలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. వయసులో వున్నప్పుడు వాళ్ళెంతో అందమైన వారన్నట్లుగా చక్కని పోలీకలు ముఖంలోని ముడతల్లో వొదిగిపోయి అందంగా కన్పిస్తున్నాయి. ఆయనకి తొంభైకి పైనే వుండొచ్చు. పదేళ్ళు తగ్గించినా ఆమెకు ఎనభైకి తక్కువ వుండవు' అనుకుంది అరవింద వాళ్ళనే చూస్తూ.

ఆయన బక్కపల్చగా, తెల్లగా, సన్నగా వున్నాడు. తెల్లని గ్లాస్కోపంచె, లాల్చీ. లాల్చీ లోపలి నుండి జందెం కన్పిస్తోంది. ఆ తలమీదున్న కొద్దిపాటి జుట్టు తెల్ల తెల్లగా దూదిపింజెల్లా.

ఆమె ముదురాకు పచ్చరంగు నేత చీరకు జరీ బోర్డరు చీర కట్టుకుని వుంది. చేతులకు ఎర్రటి మట్టిగాజులు. మెడలో పసుపుతాడు, నల్లపూసలు, రెండుపేటల చంద్రహారం. చెవులకు తెల్లరాళ్ళకమ్మలు, తెల్లటి వొంటిరాయి ముక్కుపుడక. అస్తమించే భానుడి ఎర్రదనానికి దీటుగా నుదుటి మీద ఎర్రటి పెద్ద కుంకుమబొట్టు. ఆయన బోసి నోటితో ఏదో చెబుతూంటే ఆమె తలూపుతోంది.

అరవింద అలా చూస్తూ వుండగానే కొంతసేపటి తర్వాత ఆ పెద్దాయన లేచాడు. బెంచీ ప్రక్కగా ఆనించి వుంచిన చేతికర్రను ఎడమ చేతిలోకి తీసుకుని నిటారుగా నిలబడ్డాడు.

తర్వాత ఆమె చేతికి తన కుడి చేతిని అందించాడు. ఆ చెయ్యి పట్టుకుని ఆమె నెమ్మదిగా లేచింది. ఆమె నడుము కొంచెం వొంగి వుంది. పమిట కొంగు ముడతను సర్దుకుని భర్త చేతి సాయంతో జాగ్రత్తగా ఆడుగు ముందుకు వేసింది. ఆమె అడుగులకు ఆనుగుణంగా ప్రక్కనే నడక సాగించాడాయన కర్రసాయంతో.

ఆమె ముడి వేసింది. వయసులో పెద్ద జుట్టేనేమో. చేతిముడి మెలిపెట్టి పెద్దగా వుంది. ముడిలో తురిమిన చామంతి పువ్వులు. శరీరంలో అనవసరమైన కొవ్వు ఇసుమంత కూడా లేదు.

'ఎంత అదృష్టవంతులు? ఆమె ఎంత పుణ్యాత్మురాలో చక్కగా బొట్టు, పవ్వులు వెంట జీవన సహచరుడు ఎంతమంది పిల్లలో?'

ఇంటికి చేరినా అరవింద కళ్ళకు ఆ వృద్ధ దంపతులు ఇరువురూ ఒకరికొకరుగా నెమ్మదిగా నడచి ముందుకు వెడుతున్న దృశ్యమే కన్పించసాగింది.

భర్త, శ్యాంసుందర్‌కి కూడా అదే విషయం ఒకటికి నాలుగుసార్లు మళ్ళీ మళ్ళీ చెప్పింది. ''ఎంత ముచ్చటగా వున్నారండీ. జీవితంలో తోడు నీడ అంటే అదేనేమో అన్పిస్తోందండీ''

''నువ్వు నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటే నేను రిటైరయ్యాక మనం కూడా అలాగే తిరగొచ్చు'' అన్నాడు శ్యాంసుందర్ నవ్వుతూ.

''అంత అదృష్టమా! ఏం పాపం చేశానో ఏమో ఈ మాయదారి షుగర్, బి.పి నాకు దాపురించాయి''

ఆ తర్వాత అరవింద క్రమం తప్పకుండా రోజూ సాయంత్రం పార్కువైపు వెళ్ళడం ప్రారంభించింది. ఆ దంపతుల్ని చూడాలని. రోజూ వాళ్ళు కూడా అదే సమయానికి కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా రోడ్ ప్రక్కగా జాగ్రత్తగా నడుస్తూ పార్కుకి వచ్చే వాళ్లు. కొంచెం సేపు బెంచీ మీద కూచుని పిల్లల ఆటల్ని చూస్తూ కాలక్షేపం చేసి ఆ తర్వాత అవతల ప్రక్కగా వున్న సందులోకి వెళ్లిపోయేవారు. వాళ్ళ రాకపోకల్ని గమనిస్తూ 'ఇంత వృద్ధాప్యంలో కూడా వాళ్ళిద్దరూ క్రమం తప్పకుండా నడుస్తూంటే తనకేం రోగం' కాళ్ల నొప్పులు అనుకోవడం మానేసి ఉషారుగా గబగబ నడవడం ప్రారంభించింది.

ఒక రోజు సాయంత్రం ఆ వృద్ధ దంపతులిరువురూ కన్పించలేదు. ఒక్క క్షణం చాలా నిరాశగా అన్పించింది అరవిందకు. వాకింగ్ చేస్తున్నంత సేపూ వాళ్ళ కోసం అటు ఇటు చూస్తూనే వుంది. వాళ్ళకోసం చూస్తూ పార్కులో చాలాసేపు కూచుంది. మసకచీకట్లు క్రమ్ముతుండగా తిరిగి ఇంటికి వెడుతూంటే అప్పుడు కన్పించారు. వాళ్లని చూడ్డంతోనే చిరుదరహాసం పెదవుల మీద మెదిలింది. ఆ కాలనీలో ఓ ప్రక్కగా కమ్యూనిటీ సెంటరు కట్టడం కోసం ఎత్తుగా పునాది వేసి వదిలేశారు. ఆ పునాది గట్టు మీద కూచొని ఇద్దరూ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఓరి మీరిక్కడున్నారా? ప్రక్కన పడున్న రాళ్ల మీదుగా పైకెక్కి ఎలా కూచున్నారో?' తెగ సంతోషపడిపోయింది అరవింద. 'అసలు ఆ రాళ్ళ మీద నుండి ఎలా ఎక్కింది? బహుశః ఆయన ఆమె నడుం పట్టుకుని ఎక్కించాడేమో?' నవ్వుకుంది అరవింద. వాళ్ళు దిగడం చూడాలని అన్పించిందామెకు. కానీ వాళ్ళు ఎప్పుడు క్రిందకు దిగుతారో? రోడ్ మీద అంతసేపు అలా నిలబడితే బాగుండదని ముందుకు సాగిపోయింది.

''నాకు నాలుగుమెట్లు ఎక్కాలంటే కాళ్ళు నొప్పులు. ఆయాసం. ఆ ముసలాళ్ళిద్దరూ ఎలా ఎక్కారోనండీ'' అంది భర్త శ్యాంసుందర్‌తో.

''ఈ సారి వాళ్ళు కన్పించినప్పుడు నీ సంశయం తీర్చుకో'' అన్నాడతను నవ్వుతూ.

నిజమేనండీ. నాకు కూడా వాళ్ళని పలకరించి మాట్లాడాలని వుంది. వాళ్ళు చూస్తూంటే కడుపు నిండిపోతోంది. ఎంత చక్కగా కబుర్లు చెప్పుకుంటారండీ. మనిద్దరికీ పది మాటలు మాట్లాడుకుంటే అదే ఎక్కువ. పొద్దస్తమానం టి.వి. చూడడంతోనే సరిపోతోంది. వెధవ టి.వి ఇరవై నాలుగు గంటలూ సినిమాలు లేకపోతే ఆడవాళ్ళు జుట్లు పీక్కునే సీరియల్స్.

''టి.వి. చూడమని నిన్నెవరు బలవంతం చేస్తున్నారు?''

''ఏం చెయ్యను? మనిద్దరికీ వంట ఎంతసేపు? అది కూడా వండుకోలేకపోతే బయటినుండి తెచ్చుకు తినడం పనేంవుంటుంది? టి.వినే కాలక్షేపం. మీరు మాత్రం ఏం చేస్తున్నారు! ఉదయం లేచినప్పట్నుండీ ఒకవైపు వార్తలు చూస్తూ మరోవైపు పేపరు తిరగేస్తారు. ఆ తర్వాత నాలుగు మెతుకులు హడావిడిగా తిని ఆఫీసుకు పరుగెడతారు. మళ్లీ ఇంటికి ఎప్పుడు చేరతారో తెలియదు. వచ్చిన వెంటే మళ్లీ టి.వి. ఆన్ చేసుకుని చూసిన వార్తల్నే మళ్ళీ మళ్ళీ చూస్తూ కూచుంటారు. టి.విలు వచ్చిన తర్వాత మనషులు మాట్లాడుకోవడమే తగ్గిపోతోంది'' అన్నది అరవింద.

అంతలోనే అనిల్ వచ్చాడు. ''అమ్మా ఏం చేస్తూన్నారంటూ''

అనిల్ అరవింద కొడుకు. కూకట్‌పల్లిలో ఫ్లాట్ కొనుక్కుని అక్కడే వుంటున్నాడు. ఎప్పుడో ఒకసారి వీలుకుదిరినప్పుడు వస్తాడు.

''ఏంరా అనిల్ ఎలా వున్నావు? పిల్లల్ని కూడా తీసుకు వస్తే బావుండేది గదా!''

''నేను పనుండి ఇటువైపు వచ్చానమ్మా. వెళుతూ వెళుతూ ఓ పదినిమిషాలు వుండి పోదామని వచ్చాను'' అంటూనే రిమోట్ అందుకుని టి.వి పెట్టాడు.

శ్యాంసుందర్ నవ్వుతూ అన్నాడు ''ఇప్పటి దాకా మీ అమ్మ టి.వి గురించే పోట్లాడుతోందిరా! మాట మంచి లేకుండా ఎప్పుడూ టి.వి చూస్తుంటారని''–

ఆ మాటకు అనిల్ ఫక్కున నవ్వాడు. 'టి.వి. మంచి కాలక్షేపం. ఎన్నో విషయాలు తెలుస్తుంటాయి. ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ఇంట్లో వుండి తెల్సుకోవచ్చు. టి.వి. పెట్టుకుంటే

అర్ధరాత్రయినా ఒంటరితనం అన్పించదు. అయినా ఎప్పుడూ ఏం మాట్లాడుకుంటాం? ఏం వుంటాయి మాట్లాడుకోడానికి? అందరికీ రొటీన్ లైఫ్. రొటీన్ లైఫ్‌లో టి.వి పెద్ద రిలీఫ్'' అంటూ టి.వి. ఛానల్స్ మార్చసాగాడు.

అరవిందకు వళ్ళు మండింది''వున్న కొంచెంసేపైనా కబుర్లు చెప్పొచ్చుగదా! మంచి చెడు అడగొచ్చుగా. పిల్లల సంగతులు చెప్పకుంటే ఎంత సరదాగా వుంటుంది?'' అనుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయింది.

ప్రస్తుత రాజకీయాలు తండ్రితో జోక్‌గా మాట్లాడుతూ గడిపాడు అనిల్ ఒకవైపు టి.వి చూస్తూ. ఇక వెళ్లాలని లేవబోతూంటే ''భోజనం చేసి వెళ్ళరాదూ? ఆమ్లెట్లు వేస్తాను'' అన్నది అరవింద కొంచెం కోపం తగ్గించుకుని.

''ఇప్పుడు కాదులే'' అంటూ బయటకు నడుస్తూ–

''ఒక పదిరోజులు నాన్న, నువ్వు ఇంటికి వచ్చి వుండొచ్చుగదా!'' అన్నాడు.

''అక్కడకు వచ్చి మాత్రం ఏం చేస్తాం? నువ్వు, కోడలు ఆఫీసుకు వెడతారు. పిల్లలు స్కూలుకు, నాన్న ఆఫీసుకు వెళతారు. అక్కడ కూడా టి.వి. చూడడమేగా నా పని''

''ఏ ఇంట్లోనైనా అంతే. నీ ఆరోగ్యం జాగ్రత్త'' అంటూ స్కూటర్ దగ్గరకు నడిచాడు ''వస్తాను నాన్నా'' అంటూ

కొడుకు వెళ్ళగానే శ్యాంసుందర్ టి.వి ముందు సెటిల్ అయిపోయాడు. ప్రక్కనే వున్న చిప్స్ ప్యాకెట్‌ని అందుకున్నాడు.

అరవిందకు ఏదో వెలితిగా అన్పించింది. మనసంతా భారంగా వున్నట్టనిపించింది. రక్త సంబంధీకుల మధ్య కూడా మనసు విప్పి మాట్లాడుకోవడం, ఆత్మీయతలు పెంచుకోవడం తగ్గుతున్నాయన్పించింది. అరవిందకు కళ్లు చెమ్మగిల్లాయి. బెడ్ రూంలోకి వెళ్లి ప్రక్క మీద వాలిపోయింది. ఆమెకు ఆ వృద్ధ దంపతులు గుర్తుకు వచ్చారు.

'వాళ్ళిద్దరూ ఎన్ని కబుర్లు చెప్పుకుంటారు? ఎప్పుడూ ముసిముసి నవ్వులే. వాళ్ల జీవితంలో ఎన్ని అనుభవాలు? ఆ అనుభవాలన్నింటినీ మళ్ళీ మళ్లీ విప్పి చెప్పుకుంటారా? మధురస్మృతుల్ని గుర్తు చేసుకుంటారా? మనుమలు, మునిమనుమల చిన్నారి చేష్టల్ని ముచ్చటగా, ముద్దుగా, సరదాగా విడమర్చి చెప్పుకుంటారా? ఈసారి వాళ్ళు కన్పించినప్పుడు పలకరించాలి. వాళ్ళ జీవనంలోని మధురిమను ఆకళింపు చేసుకోవాలి' అని నిశ్చయించుకున్నాక గానీ అరవిందకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

మర్నాడు అదే వుత్సాహంతో వాకింగ్‌కి బయలుదేరింది. ఆ వృద్ధ దంపతులు రోజూ కూచునే సిమెంటు బెంచీకి దగ్గరగా వున్న బెంచీ మీద కూచుంది వాళ్ళతో మాటలు కలపడానికి వీలుగా. ఆ జంటరాక కోసం ఎదురు చూసింది. ప్రొద్దు వాలుతోంది. కానీ ఆ జంట మాత్రం ఆ ఛాయలలో ఎక్కడా కన్పించలేదు. నిరాశ ఆమెను ఆవరిస్తూంటే నెమ్మదిగాలేచి, పార్కు దాటి రోజూ ఆ వృద్ధ జంటనడిచే రోడ్ వైపే చూస్తూ రేపు కన్పిస్తారులే' అని అనుకుంటూ వెనుదిరిగి ఇంటి వైపు నడక సాగించింది.

ఇక ఆ తర్వాత నాలుగు రోజులు ఆరోగ్యం మరీ బావుండక వాకింగ్ మానేసింది అరవింద. ఆ నాలుగు రోజులూ ఆ వృద్ధ దంపతుల్ని గుర్తుకు చేసుకుంటూనే వుంది. కాస్త ఆరోగ్యం కుదుటపడ్డాక ఆ రోజు వాకింగ్‌కి బయలుదేరింది, వాళ్ళని తప్పక కలవాలనుకుంటూ. కానీ ఆ రోజు నిరాశే మిగిలింది. వాళ్ళు కన్పించనే లేదు. మర్నాడూ అదే పరిస్థితి. 'వాళ్ళిద్దరిలో ఎవరికైనా ఒంట్లో బాగాలేదా?' ఆ ఆలోచన రావడంతోనే ఆమె మనసు నిలువ లేదు. అంతే అప్రయత్నంగానే ఆ జంట మలుపు తిరిగే సందులోకి వెళ్ళింది, వాళ్ళ ఇల్లు ఇక్కడే ఎక్కడో దగ్గరలో వుండి వుంటుందనుకుంటూ.

సందులో కొంచెం దూరంలో రోడ్‌కి అడ్డంగా షామియానా వేసివుంది. అటువైపు అప్రయత్నంగా నడక సాగించింది. అక్కడ వేసి వున్న ప్లాస్టిక్ కుర్చీల్లో ఒకదానిలో అచ్చు పెద్దాయన పోలికలున్న ఒకాయన కూచుని వున్నాడు. పెద్దాయన పేరు తెలియదు. వారిని గురించి ఏమీ తెలియదు. ఏమని అడగాలి?' సంశయంగా షామియానా బయటే ఆగిపోయింది.

''రామ్మా'' అన్నారాయన అరవిందని చూసి దుఃఖంతోను, అలసటతోను, నిద్ర లేమితోను ఆయన ముఖం బాగా వడలిపోయి వుంది.

'అచ్చు పెద్దాయనపోలికలే' మరోసారి అనుకుంది అరవింద ఆయన ముఖంలోకి చూస్తూ. ఏదో అశుభం జరిగినట్లు అరవిందకు అన్పించసాగింది.

అరవింద వెనకాలే వచ్చినాయన, 'ఒరేయ్ సుబ్రమణ్యం, నాలుగురోజులు దాటింది నువ్వింకా గుండెదిటవు చేసుకోకపోతే ఎలాగూ? చెయ్యవల్సిన కార్యక్రమాలు చాలా వున్నాయి'' అన్నాడు ఆయన ప్రక్కన కుర్చీలో కూచుంటూ.

సుబ్రమణ్యంగారు ఏమీ మాట్లాడలేదు. ఆ వచ్చినాయన అరవిందను చూస్తూ ''కూచోమ్మా'' అన్నాడు.

అక్కడ గాలి స్తంభించినట్లుగా, గంభీరంగా, నిశ్శబ్దంగా వుంది. అంతలో లోపలి నుండి చిన్న పిల్లవాడి ఏడ్పు గొంతు విన్పించింది. ''పెద తాతగారు ఎప్పుడు వస్తారు? ఈ రోజు తాతగారు రాకపోతే అన్నం తినను''

సుబ్రమణ్యంగారి కళ్ళు చెమ్మగిల్లాయి. ''నువ్వే చెప్పమ్మా నా మనుమడికి ఏమని జవాబు చెప్పాలి'' అన్నారు అరవిందను చూస్తూ. ఆ స్వరం నీరసంగా వుంది.

''ఏంరా సుబ్రమణ్యం నీకే చెప్పేది. తిండి, నిద్రలేక ఇంటిల్లపాది ఇలా కుమిలి పోతూ కూచుంటే కాలమాగుతుందా? పనులెలా జరుగుతాయి?''

''ఔను నారాయణ పనులెలా జరుగుతాయి? అమ్మా, నాన్న లేకుండా ఈ ఇంట్లో ఇంతవరకూ ఒక్క కార్యక్రమం కూడా జరుగలేదు. అమ్మా నాన్న ఏమీ చెప్పకుండా పోయారు. ఏ పని ఎలా చెయ్యాలో తెలియదు''

''నీతో లాభం లేదురా సుబ్రమణ్యం'' అని లోపలి వైపుకు చూస్తూ ''వైకుంఠం మీ నాన్నతో కుదరదురా'' అన్నారు నారాయణ.

లోపలినుండి బయటి వరండాలోకి వచ్చిన వైకుంఠం, ''చెప్పు మామయ్యా'' అంటూ షామియానాలోకి వచ్చాడు.

వైకుంఠాన్ని చూడడంతోనే గుర్తు పట్టింది అరవింద. 'ఈ అబ్బాయి ఇంతకుముందు అనిల్ దగ్గరకు వస్తుండేవాడు. ఒకటి, రెండుసార్లు పలకరింపులు తప్ప అంతగా మాట్లాడలేదు.

అరవిందను చూసి వైకుంఠం ఆమెకు ఎదురుగా వున్న కుర్చీలో కూచున్నాడు. ''మా నాన్నగారు ఆంటీ'' అన్నాడు సుబ్రమణ్యంగార్ని చూపిస్తూ. ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియక ఆగిపోయాడు.

అరవిందకు కూడా ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వుండిపోయింది.

వైకుంఠమే అన్నాడు దుఃఖపూరిత స్వరంతో, ''మా తాతయ్యా, బామ్మ సడన్‌గా పోయారు''

''ఇద్దరూ ఒకేసారా? ఎలా?'' షాక్ తిన్నట్లుగా అన్పించింది.

''బామ్మ మొన్న మంగళవారం రాత్రి బాత్రూమ్‌లో జారిపడింది ఆంటీ మా అందరి సాయంతో లేచి నెమ్మదిగా నడచివచ్చి కాసేపు మంచం మీద కూచుంది. కాలిమడమ దగ్గర కొంచెం నెప్పిగా వుందని ఆవునెయ్యితో అమ్మతో మర్దన చేయించుకుంది. ఆ తర్వాత మా అందరితో కులాసాగా కబుర్లు చెప్పింది. నా కొడుకు వెంకటాద్రిని ప్రక్కన పడుకోబెట్టుకుని 'జో అచ్యుతానంద, జోజో ముకుందా' అంటూ జోకొడుతూ అలాగే నిద్రపోయింది. అంతే మరి లేవలేదు''. వైకుంఠం గొంతు బొంగురు పోయింది. ఒక్క క్షణం పాటు తమాయించుకుని మళ్ళీ అన్నాడు. ''బామ్మపోయిన మర్నాడే అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత తాతయ్య కూడా మాటమంతీ లేకుండా ఎవ్వరికీ ఏమీ చెప్పకుండా మౌనంగా వెళ్ళిపోయారు. మేం తట్టుకోలేకపోతున్నాం ఆంటీ. బామ్మ, తాతయ్య లేని ఈ ఇంట్లో మేం వుండలేం'' వైకుంఠం కళ్ళంట నీళ్ళు టపటపరాలాయి.

''సరిపోయింది ఇక్కడ తండ్రీ, కొడుకు అక్కడ మనుమడు ఎలారా మీతో? పుణ్యదంపతులు భగవంతునిలో లీనమయ్యారని మనసుని ధృడపర్చుకోవాలి'' అన్నారు నారాయణ వైకుంఠాన్ని మందలింపుగా. ఆ తర్వాత ఆయన అరవిందతో అన్నారు ''నువ్వే చెప్పమ్మా తాతయ్యకి తొంభై ఎనిమిది సంవత్సరాలు, బామ్మకి ఎనభై తొమ్మిది. పునిస్త్రీగా పసుపు, కుంకాలతో బామ్మ వైభవంగా వెళ్ళిపోయింది. కొడుకులు, కూతుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు అందరి సమక్షంలో ఆయన ఆరోగ్యంగా వెళ్ళిపోయాడు. ఇంకేం కావాలి

## తండ్రి ప్రేమ



సినిమా వారికి బంధాలు, అనుబంధాలు తక్కువ అని అందరూ అనుకుంటారు. అది తప్పు. వాళ్లూ మామూలు మనుషులే. వారికి భార్య, పిల్లలు కుటుంబం అన్నీ ముఖ్యమే. ఇవేవో సినిమా డైలాగులు అనుకుంటే పొరపాటే. దర్శకుడు శేఖర్ కపూర్‌కి తన కూతుళ్లంటే ఎంత ప్రేమ, అభిమానమంటే వారి వాయిస్‌నే తన సెల్‌ఫోన్ రింగ్‌టోన్‌గా పెట్టుకున్నాడతను. తన కూతురు 'ఐలవ్ యు డాడీ' అన్న వాయిస్‌ని రింగ్‌టోన్‌గా శేఖర్ కపూర్ మార్చుకున్న సంగతి షూటింగ్‌లో చాలా మందికి తెలియదు. ఒక ఫైన్ మార్నింగ్ శేఖర్ కపూర్ చాలా సీరియస్‌గా షూటింగ్‌లో వున్నాడు. గుండుసూది కింద పడినా చప్పుడు స్పష్టంగా వినిపించేటంత నిశ్శబ్దంలో అందరూ చకచకా పని చేస్తున్నారు. సరిగ్గా అప్పుడు శేఖర్ కపూర్ సెల్‌ఫోన్ 'ఐలవ్ యూ డాడ్' అంటూ పిలవడం ప్రారంభించింది. ఆ రింగ్‌టోన్ ఎవరి దగ్గర నుంచి వస్తోందో తెలియక కొద్ది సేపు అందరూ ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకోవడం మొదలుపెట్టారు. వెంటనే తేరుకున్న శేఖర్ సెల్‌ఫోన్ ఆఫ్ చేసేశాడు. అప్పుడు తెలిసింది. ఆ ఫోన్ శేఖర్ కపూర్‌కోసం వచ్చిందని, చేసింది అతని ముద్దుల తనయ అని.

తల్లీ? మనిషి పుట్టాక మరణం కూడా వ్రాసి పెట్టాడు కదా ఆ భగవంతుడు''

''అమ్మా నాన్నలకి వందేళ్లు నిండలేదు నారాయణ. అదే నా బాధ'' అన్నారు సుబ్రమణ్యంగారు. అలా శూన్యంలోకి చూస్తూ ఆయన తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నారు. ''మమ్మల్నందర్నీ ఎంత ఆదరంగా చూశారు? ఎలా జీవించాలో చెప్పారు. ప్రశాంతంగా ఎలా గడపాలో నేర్పారు. నాకు నేర్పారు, నా కొడుకులకి నేర్పారు. నా మనుమలు, మనమరాళ్ళకి నేర్పారు. కానీ నేను నా మునిమనుమలకి అవన్నీ చెప్పగలనా? అసలు మనం ఎవరైనా నాన్న కోపాన్ని ఎరిగున్నామా నారాయణ?''

నారాయణ గారు సుబ్రమణ్యంగార్ని అనునయిస్తుంటే ''అమ్మలోపల వుంది ఆంటీ'' అంటూ అరవిందను లోపలకు తీసుకు వెళ్ళాడు వైకుంఠం.

లోపల చాలా మందేవున్నారు. ఎక్కడి వాళ్ళు అక్కడే దిక్కు తోచని వాళ్ళలాగా.

టేబులు మీద వృద్ధదంపతుల ఫోటో వుంది. పెద్ద చామంతి పూల దండ. ఆ ఫోటో ఈ మధ్యనే తీయించిన ఫోటోలాగా వుంది.

అరవింద ఆ ఫోటోను చూస్తూంటే వైకుంఠం అన్నాడు. ''ఒక వారం క్రితం తాతయ్య అడిగాడు ఆంటీ. నేను మీ బామ్మ కల్సి ఫోటో తీయించుకుంటాం, ఫోటో స్టూడియోకి తీసుకెళ్ళమని.

బామ్మతో కల్సి తాతయ్యకు ఫోటో తీయించుకుకోవాలని సరదాగా వుందని, తాతయ్య రోజురోజుకి పెళ్ళి కొడుకైపోతున్నాడని ఆ రోజున అందరం హాస్యమాడాం. ఇంటి దగ్గర తీస్తామంటే వద్దని స్టూడియో వాళ్ళు బాగా తీస్తారన్నాడు. ఆ రోజున తీయించిన ఫోటో ఈ రోజునీ విధంగా వుపయోగపడింది''

అరవిందకు కళ్ళు చెమ్మగిల్లాయి ''ముఖంలో జీవం వుట్టిపడుతోంది''

వైకుంఠం అరవిందతో అన్నాడు ''మా అమ్మ కాత్యాయనీ ఆంటీ'' మూలగా గోడకు అనుకుని కూచుని వున్న కాత్యాయనిని చూపిస్తూ వైకుంఠం అచ్చు అమ్మలానే వున్నాడు.

కాత్యాయని నెమ్మదిగాలేచింది ''మా అత్తగారు, మామగారు మమ్మల్ని చాలా అన్యాయం చేశారమ్మా. మర్నాడు వాళ్ళ పెళ్ళి రోజు. ఎనభయ్యవ పెళ్ళిరోజు. మామగారు పెట్టే పాయసం తినాలని అందరూ చేరారు. పెళ్ళి వేడుక చేయించుకోకుండానే మాయమాయ్యారు.''

''ప్రతి సంవత్సరం దీపావళికి, సంక్రాంతికి ఎక్కడెక్కడి వాళ్ళం పిల్లా జెల్లాతో తాతయ్య, బామ్మ ఎక్కడుంటే అక్కడికి చేరతాం. అది తాతయ్య మమ్మల్నందర్నీ కలవడానికి పెట్టిన నిబంధన. ఇక ఆ పెద్ద దిక్కు లేదుగా ఆంటీ. ఎవరి వుద్యోగాల్లో వాళ్ళం, ఎవరి బిజీలో వాళ్ళం తలో దిక్కై పోతామేమో?'' అన్నాడు వైకుంఠం దిగులుగా.

ఇక మమ్మల్ని అనునయించి ఒకచోటికి చేర్చే వాళ్ళెవరు? ఆ బుజ్జగింపులు ఇంకెక్కడ?'' రెండో కోడలు అంది.

''పండుగవస్తే మా ఇంట్లో దంపుడు బియ్యంతో చేసిన బెల్లపు పర్వాణ్ణం తప్పనిసరి. బియ్యం ఎన్ని వెయ్యాలో పెసరపప్పు, బెల్లం, నెయ్యి, పాలు ఎంతెంత వెయ్యాలో అత్తయ్యా దగ్గరుండి వేయించేది. జీడిపప్పు, బాదంపలుకులు, యాలకుల పొడి తప్పని సరనేది. అత్తయ్య దగ్గరుండి శ్రద్ధగా వండిస్తే, మామయ్యగారు మరింత శ్రద్ధగా, చక్కగా అందరికీ తనే స్వయంగా అరటి ఆకులో పెట్టి ఇచ్చేవారు. అక్షింతలు జల్లి ఆశీర్వదించేవారు.

''ఆ పర్వాణ్ణం కోసం అందరం తప్పని సరిగా ఆ రోజుకైనా చేరేవాళ్ళం. ఇక తీపి మాకు దూరమైయింది''

''నలుగురం కోడళ్ళం. ఆరుగురం ఆడపడుచులం. మమ్మల్నందర్నీ తల్లిగా చూసుకుంది. మా మధ్య పొరపాటున కూడా ఎటువంటి పొరపొచ్చాలు రాకుండా జాగ్రత్తగా కనిపెట్టుకుని వుండేది. అలాంటిది ఎవ్వరికీ ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయారు. పాదాలకు నెయ్యి రాస్తున్నప్పుడు మర్నాటికి మినపప్పు ఎన్ని నానపొయ్యమంటారు'' అని అడిగాను.

''తెల్లవారు ఝామున నాలుగు గంటలకి నేను నానపోస్తాలే, నువ్వెళ్ళి పడుకో. ప్రొద్దుపోయింది అన్నారు. అంతేగానీ మరో మాట చెప్పలేదు. పెద్ద కోడల్ని నా కైనా చెప్పొచ్చుగదా! కనీసం పాదాలకు నమస్కారం చేసుకోమని చెప్పొచ్చుగదా!'' కాత్యాయని స్వరం పూడుకుపోయింది.

ఆమె చెయ్యిని అప్రయత్నంగా, ఆప్యాయంగా అందుకుంది అరవింద.

''తాతయ్య ఎప్పుడొస్తాడు? నాకు ఆకలేస్తోంది'' లోపలి నుండి వచ్చిన బొమ్మల్లాంటి చిన్న పిల్ల కాత్యాయని చీర కుచ్చెళ్ళలో వొదిగి పోయింది ఆ పిల్లను భుజాన వేసుకుని లోపలకు వెళ్ళింది కాత్యాయని.

అప్పుడే లోపలకు వచ్చిన నారాయణ అరవిందతో అన్నాడు. అసలు ఈ ఇంట్లో పద్ధతే వేరమ్మాయ్. బయటి నుండి స్వీటు అన్నది ఈ కుటుంబంతో నాలుగు తరాల వాళ్ళం ఎరగరనుకో. మునిమనుమళ్ళు సైతం చాక్లెట్ ముట్టరు. 'ఛీ' అంటారు. ఇంట్లో చేసిన నెయ్యి, బెల్లం వంటకాలే.

''ప్రతిరోజు భోజనంలో పప్పు, కూరలు, పాలు, పెరుగు, పళ్ళు తప్ప ఇంకోవాటిని ముట్టునిచ్చేవాడు కాదు పెద్దాయన. ఒక్క లిప్త ఆగి ఆ అన్యోన్య దంపతులు ఒకరి వెంట ఒకరు చటుక్కున వెళ్ళిపోయారు. నా ఆయుష్షు కూడా పోసుకుని ఇంకో పదేళ్ళపాటు వుంటే బావుండేది'' చెమ్మగిల్లిన కళ్ళను పై కండువాతో వొత్తుకున్నారు.

'వాళ్ళతో మాట్లాడాలన్నా తన కోరిక తీరకుండానే వాళ్ళు వెళ్ళిపోయారు! అరవింద గుండె చెమ్మగిల్లింది'. నిజమే బాల్యం ప్రతి మనిషికీ భగవంతుడిచ్చిన వరం. కానీ ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా, నియమబద్ధంగా గడుపుతూ, పాణిగ్రహణం చేసిన భార్య చెయ్యిని వదలకుండా ఎనభై సంవత్సరాల వైవాహిక జీవితం గడపడం భగవంతుడు ఎవరికో తప్ప ఇవ్వని అపురూప వరం' ప్రక్కనే ప్లేటులో వున్న పూలను అందుకుని ఫోటోలోని వారి పాదాలకు దగ్గరగా వుంచి శిరస్సు వొంచి నమస్కరించింది అరవింద.

★